# చిన్న కథ రచనకు కొన్ని సలహాలు

ఈకాలంలో అనేకపత్రికలలో అనేక చిన్నకథలు ప్రకటించబడుతున్నాయి. చిన్న కథలు రాయడంలో కొందరు పేరుప్రతిష్ఠలు గణించారు. తక్కినవారి రచనలకంటే వీరి రచనలు చాలా బాగుంటాయి. కాని సామాన్యంగా యిప్పటి చిన్న కథలన్నిటిలోనూ కొన్నిలోట్లు కనబడుతున్నాయి. ఈలోట్లు లేని కథలెక్కడోగాని కనపడవు. పేరుపొందిన రచయితల కథలలో కూడా ఈలోట్లు తరుచు కనబడుతూనే వుంటాయి. ఈలోపాలు బహుస్వల్పమైనవేకాని గాఢమైనవికావు. ఇవి బహుసులువుగా సవరించుకోవచ్చు. సవరించుకుని కథలు ఎంతోరసవంతంగా చేసుకోవచ్చు. పేరుపొందిన పాశ్చాత్యకథకుల కథలు చదివి మనకథలకూ వాళ్ళకథలకూ వుండే భేదాలు చూశాను. చూసినమీదట మన కథలలో కనబడుతూన్న లోపాలు తెలుపుతున్నా.

మనకథలు సాధారణంగా చాలా టూకీగా వుంటాయి. దీనికికారణం కథకుని భావనలోనిలోపమే, కథకుడు తానురాసేకథ లోకంలో నిజంగా జరిగినట్టు నమ్మాలి. అతనిభావన అంత తీవ్రంగావుండాలి. అప్పుడే కథ రసవంతంగా రాయగలుగుతాడు. తాను నమ్మని ఒక వ్యూహం పాఠకులచేత అసలే నమ్మించలేడు. అటువంటి రచన రసహీనంగా వుంటుంది. తాను సృష్టించిన పాత్రలు సజీవ వ్యక్తులేగాని దయ్యాలలాగ శరీరంలేనివారని అనుకోకూడదు. ఎప్పుడైతేవారు సజీవవ్యక్తులని అనుకుంటాడో అప్పుడే ఒకడి ఆకారానికీ మరొకడి ఆకారానికీ భేదం—ఒకడిమనస్సుకీ, నడతకీ, మరొకడిమనస్సుకీ, నడతకీ భేదం కనబడుతుంది. పాత్రలలోని తబిసీళ్లు కూడా విశదంగా వర్ణించగలుగుతాడు. ఇటువంటి పాత్రలను సంచరింపచేసే ప్రపంచం కూడా అంత సహజంగానూ వుంటుంది. అటువంటి సహజవ్యక్తులూ, సహజప్రపంచంగల కథలు ఎన్నడూ టూకీగా వుండవు. లోకంలో ఏదేనా టూకీగా జరుగుతుందా? ఈలోకానికి కొంత ప్రతి అయిన కథాలోకంలో మాత్రం టూకీగానూ, అసహజంగానూ ఎలాగ జరుగుతుంది? ఈమార్పు కనక మన చిన్నకథలలో చేసుకున్నట్లైతే, ఇప్పటి టూకీకథలిచ్చే ఆనందంకంటే ఆకథలు పదిరెట్లు ఎక్కువ ఆనందం యిస్తాయి.

ఈకాలపు చిన్నకథలను గురించి మరొక ముఖ్యమైన సంగతేమిటంటే—ఈ అంశం చూస్తే తెలుగులో ఇంకముందు చిన్నకథ వాఙ్మయం నశించిపోతుందా అనిపిస్తూంది. ఇప్పుడు కొంతకొంతమంది వట్టి సంభాషణలే రాస్తున్నారు. ఇవి చిన్నకథలని భ్రమపడుతున్నారు. ఈసంభాషణలు చిన్నకథలూకావు, చిన్న నాటకాలూకావు, సాహిత్యచిత్రాలూ కావు, ఏవీకావు. ఇవి రసవంతమైనవి ఏవీ కావు. మరేమిటంటే, ఇవి చిన్నకథ వాఙ్మయాన్ని నాశనంచేసే ఒకవాక్యసముదాయం. ఈ సంభాషణలు వ్యూహంలేని కొన్ని రచనలకు బాగుంటాయికాని వ్యూహంవున్నవాటికి ఏమాత్రమూ పనికిరావు. ఈసంభాషణపద్ధతిని సృష్టించినవారు శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య

శాస్త్రిగారు. ఆపద్ధతినే ఇప్పుడు అనేకమంది అవలంబిస్తున్నారు. ఈ పద్ధతికి మూలపురుషులు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కాబట్టి వారి రచనలలోంచే వీటికి వుదాహరణ లిస్తాను, వ్యూహంలేని రచనలకు సంభాషణలు సరిపోతాయికాని వ్యూహంవున్నవాటికి సంభాషణలు పనికిరావు అంటిని. శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన 'యావజ్జీవంహోష్యామి' (1926 సం॥ భారతిలో పడింది) 'బ్రాహ్మణాగ్రహారం' (భావ సం॥ ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచికలో పడింది) చూడండి. ఎంతో బాగుంటాయి. అత్యద్భుతంగా వుంటాయి. ఆరెండు రచనలలోనూ వ్యూహం లేదు: వివిధాలైన దృశ్యాలు మాత్రమే చిత్రించబడ్డాయి. ఇటువంటి రచనలకుసంభాషణలు ఎంతేని బాగుంటాయి. కాని శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఇటీవల ప్రకటించే సంభాషణలు చూడండి. ఇవి చిన్న కథలని చాలమంది భ్రమ. ఇవి కథలూకావు, ఏవీ కావు. కథావాఙ్మయానికి విపత్తు కలిగించేటటువంటి వాక్యసముదాయాలు మాత్రమే. ఇటీవల సంభాషణలకు వ్యూహాలున్నాయి. వ్యూహాలున్నవాటికి ఈ సంభాషణలు పనికిరావు అంటాను. ఈమోస్తరుగా చిన్నకథలనుకుని సంభాషణలురాసే కథకులంతా తాము కథావాఙ్మయానికి చేస్తూన్న అపకారాన్ని గ్రహించ కోరుతాను. వ్యూహాలుగల కథలను సంభాషణలుగా రాయవద్దు.

మరొకవిషయం. ఇద్దరు మనుష్యులు మాట్లాడుతున్నారనుకోండి. వారిద్దరూ మాటలను మాత్రమే వుచ్చరించి వూరుకోరు. ఆమాటలనైనను ఒకమాటు వుచ్చరించినట్టుగా మరొకమాటు వుచ్చరించరు. వుచ్చరించడానికి పూర్వం మనస్సులో భావాలుగాని, స్పందనములుగాని వుంటాయి. ఎదుటివాడి మాటలు విన్నప్పుడు మళ్లా ఏవేవో మార్పులు కలుగుతాయి. కథకు అవసరమైనంతమట్టుకు ఇవి అన్నీకూడా కథలో చేర్చవలసిందే. కథయొక్క ఆనందానికి అడ్డురాకుండేటట్లా వాటిని జాగ్రత్తగా చేర్చాలి. పాశ్చాత్యకథకులు ఈ అంశాన్ని ఎంతో జాగ్రత్తగా గమనిస్తారు. ఉదాహరణకు హెచ్. జి. వెల్సుఅను ఒక ఆంగ్లకథకుని ఒక చిన్నకథలోని ఒక చిన్నముక్కను ఇక్కడ అనువదిస్తాను.

.........................

మచ్చవున్న పెదిమిగల సన్నటి మనిషి మొట్టమొదట మాట్లాడాడు. 'ఎక్కడాలేరు' అని నిస్పృహ తెలిపే గొంతుకతో అని 'కాని, ఎంతా, ఒక్కరోజేకాదూ వాళ్లు ముందు బయలుదేరారు' అన్నాడు.

'వాళ్ళవెంట మనం వస్తున్నామని వాళ్ళకు తెలియదు' అన్నాడు తెల్లగుర్రంమీద వున్న ఒక పొట్టిమనిషి.

అప్పుడు నాయకుడు 'ఆమెకు తెలుసు' అని తనలో మాట్లాడుకుంటూన్నట్లుగా పలికాడు.

'అయినను వాళ్లు వేగిరం వెళ్ళలేరు. వాళ్ళదగ్గిర గుర్రంలేదు, కంచరగాడిదేగాని. ఆ అమ్మాయికాలు రక్తం కారుతూనే వుంది—'

వెండికళ్లెం పట్టుకున్నమనిషి (నాయకుడు) వాడివైపు తీవ్రంగాచూసి 'నేను చూడలేదనుకున్నావా' అని కోపంతెలిపే స్వరంతో అన్నాడు.

'అది ఎలాగయినా సాయపడుతుంది' అని పొట్టిమనిషి నెమ్మదిగా జారవిడిచాడు.

'మచ్చపెదిమిగల సన్నటిమనిషి భావరహితంగా చూసి 'వాళ్లు ఈలోయ దాటిపోరు, మనం వేగిరం స్వారీచేసి వెళితే—' అని తెల్లగుర్రం వైపు చూసి వూరుకున్నాడు.

వెండికళ్ళెం పట్టుకున్నమనిషి 'వెధవ తెల్లగుర్రాలు' అని తాను తిట్టిన గుర్రాల లోనే చేరిన ఆతెల్లగుర్రంవైపు చూశాడు.

పొట్టిమనిషి తన గుర్రంయొక్క చెవుల మధ్య దృష్టినిలిపాడు. నిలిపి 'నాశాయశక్తులా చేశాను' అన్నాడు.

తక్కిన యిద్దరూ లోయవైపు కొంతసేపు చూశారు. సన్నటిమనిషి మండతో మచ్చపెదిమిమీద రాసుకున్నాడు.

..................................

పాత్రలు సజీవవ్యక్తులనీ, వారు సంచరించే ప్రపంచం యదార్థమైనదే అనీ అనుకున్నవారి రచనలో సంభాషణలు ఆమోస్తరుగా వుంటాయి. ఇంక మన తెలుగువాఙ్మయంలోనే పేరుపొందిన ఒక ఆధునికకథకుని కథలోని చిన్నభాగం ఇక్కడ చూపిస్తాను.

...................... .............

'ఆయనా. రెండుపంచలేవున్నట్టున్నాయి పాపం.'

'పొట్టి మొగమాటంమనిషిలాగ వున్నాడు రామచంద్రం. నిన్నరాత్రి విన్నావా జీతం యెంతకావాలో తేల్చమంటే యేమన్నాడోనూ?'

'ముందు బట్టలు కొనిపెట్టండీ పాపం!'

'అయితే బజారుకివెళ్ళి నీకు నచ్చినవి కొని పట్టుకురా.'

'...............'

'హాస్యంకాదు. నీకథలు అతను దిద్దిపెడుతున్నాడు. అతనికి నువ్వు బహుమతీ చెయ్యాలి.'

'.........'

'నీయిష్టంవచ్చినంత సొమ్ము పుచ్చుకుని బజారుకి-జానీకూడా వస్తుంది వెళ్లు.'

'.........'

'నుంచోకు మరి. అతను పంచెవుతుక్కుని ఆరేశాటప్పటికి నువ్వు బట్టలుతెచ్చి అతనికివ్వాలి. వెళ్లు మరి.'

'.........'

'ఆబట్టలతో నాతోకూడా మోటారులో కూచోడానికి బిడియపడుతున్నాడతను. నేలంచాపులు తేవాలిసుమా.'

'పిన్నితోకూడా చెప్పండి.'

'చెబుతానులే. నువ్వు సొమ్ముతీసుకురా.'

'.........'

'నీయిష్టం అన్నాను కాదూ.'

'.........'

'చొక్కాలుకూడా కుట్టించాలి సుమా.'

'.........'

...............

పై సంభాషణలో పాత్రలయొక్క స్పందనాలూ, చేష్టలూ ఎన్నో తెలపవలసి వుంది. అటువంటివి ఎన్నో తెలిపి రసవంతంగా రాయవలసిన ఈభాగంలో వట్టిచుక్కలుపెట్టి రసహీనం చెయ్యబడింది. పాత్రల సంభాషణలను వట్టి పొడిమాటలుగా రాస్తే రసహీనంగా వుంటుంది. ఎంతో కొంత తెలియచెయ్యవలసి వుందని అవసరమున్నచోటా లేనిచోటా అతి చాదస్తంగా చెప్పవద్దు. కథలోని ఆసక్తి, వేగం తగ్గకుండా వీలైనంతమట్టుకే ఆ అంశాలు తెలియచెయ్యాలి.

కథా[illegible]ల్పనునుగురించి ఒక చిన్నసంగతి. ఒకకథను[illegible] ఎంతముఖ్యమో, కథలకు వైవిధ్యం అంతముఖ్యం. ప్రేమ ఒక్కటే చిన్నకథకు ఆధారంకాదు. కథ ఎంతసేపూ సాంఘికంగా వుండాలనీ నియమం లేదు. కథకు పనికిరాని వస్తువే లేదు. శాస్త్రజ్ఞులూ, వర్తకులూ, దొంగలూ, విదేశయాత్రీకులూ, విదేశానుభవాలూ, భూతాలూ, దయ్యాలూ, పక్షులూ, జంతువులూ, నిర్జీవపదార్థాలూ అన్నిటినిగురించీ చిన్నకథలు రాయవచ్చు. అంతా కథకుని కల్పనలో వుంటుంది. చరిత్ర కథలనుగురించి ఏమిటంటే—చరిత్ర కథలు రాయడం బహుకష్టం. వెనకటి కాలపు మనుష్యుల జీవితం, పద్ధతులూ, ఆచారాలూ మొదలైనవి అన్నీ కళ్ళకు కట్టినట్టుగా వుంటేగాని చరిత్రకథలు రాయలేము. వెనకటికాలపు చరిత్ర ఆమోస్తరుగా తెలియచేసే గ్రంథాలు వున్నాయా? ఉంటే చరిత్రకథలు రాయండి.

నేనుచెప్పిన పై అంశాలు కథకు లంతా సులువుగా ఆచరించగలిగినవే. సామాన్యకథకుడుగాని, గొప్పకథకుడుగాని వీటిని ఆచరించి కథావాఙ్మయాన్ని అభివృద్ధిచెయ్యవచ్చు. లోకపరిశీలన, కథలో మౌలికత్వం ఏ కథకునికీ నేర్పిపెట్టలేముగాని ఈ సామాన్య అంశాలు అందరూ ఆచరించవచ్చు. ఈ అంశాలను ఆచరించి కథకులు కథవాఙ్మయాన్ని వృద్ధిచేస్తారు గాక!

[ఈవ్యాసం 1935 సంవత్సరం ఏప్రిల్ నెలలో రచించబడింది.]

—టేకుమళ్ళ కామేశ్వరరావు బి.ఏ.,బి.ఇడి.





స్థాపితం. 1920.

అత్యద్భుత కుష్ఠ రోగనివారిణి

(రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 500 లు బహుమానము.

**18** రకముల కుష్ఠులు, శ్వేతకుష్ఠు, తదితర చర్మవ్యాధులు యెంతకాలమునుండి జీర్ణించి యున్ననూ గ్యారంటీగా బాగుచేయబడును. 'అత్యద్భుత కుష్ఠురోగనివారిణి' యను దివ్యౌషధము వలన అనేక వేల రోగులు పూర్ణారోగ్యమును బొంది సంసారసుఖము ననుభవించుచున్నారు. చిరకాలమునుండి ప్రసిద్ధికెక్కిన కంపెనీ రెడ్డికంపెనీయే. యింజక్షనులవలన ఫలితముపొందని రోగు లనేకులు మాయొద్ద చికిత్సబొంది పూర్ణారోగ్యమును బడయుచున్నారు. పైవ్యాధులకేగాక శెగ, సవాయి, శుక్లనష్టము, మూర్ఛ, మూలశంక మొదలగువ్యాధులకు మాయొద్ద గ్యారంటీ ఔషధము లున్నవి.

"నకలు మందులనుచూచి మోసపోకుడు"

పూర్తివివరములకు యీక్రింది యడ్రసుకు వ్రాయుడు.

| | | |
|---|---|---|
| గోపాలపురము పోస్టు<br>(వయా) కొత్తపేట,<br>తూర్పుగోదావరి జిల్లా. | **రెడ్డి అండ్ కో**<br>(రిజిష్టర్డు) | బ్రాంచి ఆఫీస్:<br>(కుష్ఠురోగ చికిత్సానిపుణులు)<br>వాల్తేరు.ఆర్.యస్.పోస్టు. |